
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 24-06-2026
Medchal - Malkajgiri । Wednesday 24-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 23
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 23 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com

# రేవంత్ వరుస భేటీలు

- **కేంద్రమంత్రులతో సమావేశం ఏర్పాటు చేశానన్న కిషన్**

**జయభేరి, హైదరాబాద్,జూన్ 23 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు.జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణపై కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్ I స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణకు ఉన్న ఆటంకాలను తొలగించేందుకు రెండు రోజులపాటు కేంద్ర మంత్రులతో రేవంత్ జరిపిన చర్చలు సక్సెస్ అయ్యాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులతో పాటు పలు ప్రాజెక్టులకు అనుమతుల కోసం వరుసగా కేంద్ర మంత్రులతో రేవంత్ రెడ్డి భేటీ అవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేటి (మంగళవారం) ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కీలకంగా సమావేశం అయ్యారు.నేడు సైతం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసానికి వెళ్లి దాదాపు 45 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఈ సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ I వాల్యూయేషన్, స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్ II విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణాల సేకరణ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు.ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ I వాల్యూయేషన్, స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపిక,

...మిగతాది 2 లో

# పద్మశ్రీ అందుకున్న రోహిత్ శర్మ

- **పురస్కారం అందించిన రాష్ట్రపతి**
- **డెబ్యూ చేసిన 19 ఏళ్లకు అవార్డు**

**జయభేరి, న్యూఢిల్లీ :**




భారత క్రికెట్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 'పద్మశ్రీ' అవార్డును మంగళవారం (జూన్ 23, 2026) ఢిల్లీలో అందుకున్నాడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అతడు ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. రోహిత్ కెప్టెన్సీలో భారత్‌కు టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అందించినందుకు కేంద్రం ఈ గౌరవాన్ని ప్రకటించింది. విశేషమేమిటంటే, రోహిత్ 2007 జూన్ 23న అంతర్జాతీయ క్రికెట్లోకి అరంగేట్రం చేయగా, సరిగ్గా 19 ఏళ్ల తర్వాత అదే రోజున ఈ అవార్డు అందుకున్నాడు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డును మంగళవారం (జూన్ 23, 2026)న అందుకున్నాడు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రోహిత్‌కు ఈ పురస్కారాన్ని అందించారు. ఈ ఏడాది జనవరిలోనే రోహిత్ శర్మతోతో పాటు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు కూడా పద్మశ్రీ ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ గత నెలలో అవార్డు అందుకోగా, రోహిత్ శర్మ వ్యక్తిగత కారణాలతో అప్పుడు హాజరుకాలేకపోయాడు.

...మిగతాది 2 లో

# ప్రభుత్వ ఉద్యోగులకు డబుల్ ధమాకా

- **ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం**
- **పదవీ విరమణ వయసు పెంపు**

**జయభేరి, విజయవాడ, జూన్ 23 :**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఉద్యోగులకు డబుల్ ధమాకా ప్రకటించింది. రాష్ట్రంలోని సుమారు 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు వినిపించింది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో.. మంత్రివర్గం పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీలు, గురుకులాలలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారి పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అలాగే 2004 ఏడాదికి ముందు.. నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 11 వేల మంది ఉద్యోగులకు CPS నుంచి OPS అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం దొరకటంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సీపీఎస్ అసోసియేషన్ స్వాగతించింది. OM నెం.57 అమలుపై హర్షం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు లబ్ధి కలుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే వెటరన్, ఫ్యామిలీ సీపీఎస్ కంట్రిబ్యూషన్‌పైనా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 2017 నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఏపీ కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన నిర్ణయాలతో పాటుగా.. పెట్టుబడులు, ఐటీ, టూరిజం రంగాల ప్రతిపాదనలకు కూడా

...మిగతాది 2 లో



# మెట్రో కష్టాలు ఇంతింతకాదయా

- **సుమారు రూ.1,461 కోట్లు ఖర్చు**

**జయభేరి, హైదరాబాద్, జూన్ 23 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయంలో ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ, తర్వాత కేంద్రం అడ్డుపడుతోందని ఆరోపిస్తున్నారు. ఇది రాజకీయ డైవర్షన్‌గా మారిందని విమర్శలు వస్తున్నాయి. అయితే వాస్తవాలు, ఆర్థిక సవాళ్లు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలను పరిశీలిస్తే ఈ విషయం మరింత సంక్లిష్టంగా కనిపిస్తుందిహైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను ఎల్‌అండ్‌టీ నిర్వహిస్తోంది. ఇది నష్టాల్లో ఉండటం, ఆర్థిక భారం కారణంగా లీజ్ వదులుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా 100 శాతం ఈక్విటీని సొంతం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.1,461 కోట్లు ఖర్చు అయింది. ఎల్‌అండ్‌టీకి చెల్లించాల్సిన బకాయిలు, రుణాలు క్లియర్ చేయడం ఈ టేకోవర్‌కు ముఖ్య కారణం. ఇది ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఎవరూ సూచించకుండానే టేకోవర్ చేశారని, రాజకీయ నేపథ్యం ఉందని విమర్శలు ఉన్నాయి. రూ.13,600 కోట్ల వరకు ఉన్న రుణాలు, ఇవి ఇంతకు ముందు బ్యాంకుల నుంచి 8.25% వడ్డీకి తీసుకున్నవి.

...మిగతాది 2 లో

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత

- **రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా మేథోమథనం**
- **చంద్రబాబును బూచిగా చూపిస్తే తెలంగాణ సమాజంలో కొంతవరకు పొలిటికల్ అడ్వాంటేజ్ పొందే అవకాశం**

**జయభేరి, హైదరాబాద్, జూన్ 23 :**



నీ బలం, సామర్థ్యం ఎంతో తెలియాలంటే నీ ప్రత్యర్థిని బట్టే తెలుస్తుంది. అంటే నీవు ఎంచుకునే ప్రత్యర్థిని బట్టే నీ స్థాయి ఖరారవుతుంది. రాజకీయాల్లో ఇది వంద శాతం నిజం. తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయం చేస్తున్న కల్వకుంట్ల కవిత ఉద్యమకారిణి తరహా రాజకీయ నేత అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇక్కడే బెడిసికొట్టాయి. తెలంగాణలో కనీస ఉనికి లేని జనసేన పార్టీని ఆమె ప్రత్యర్థిగా ఎంచుకున్నారు. రోజూ పవన్ పై విమర్శలు చేస్తూ.. అదే రాజకీయంగా గడిపేస్తున్నారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా మేథోమథనం జరిపి.. తన సరికొత్త పార్టీ స్ట్రాటజీని, భవిష్యత్తు యాక్షన్ ప్లాన్‌ను, ప్రజల్లోకి వెళ్లే వినూత్న లైన్‌ను ఆమె సిద్ధం చేసుకున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ప్రచారమే జరిగింది. కానీ, ఆ కాన్సెప్టులను, పీకే ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను ఆమె ఎంతవరకు ఒంటబట్టించుకున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. పీకే మార్క్ పాజిటివ్ పాలిటిక్స్ ను పక్కనబెట్టి, ఆమె ఎంచుకున్న సరికొత్త పొలిటికల్ లైన్ చూసి సొంత పార్టీ శ్రేణులే ముక్కున వేలేసుకుంటున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్‌ను రగిల్చాలన్నా, రాజకీయంగా మైలేజ్ సాధించాలన్నా ఇప్పటికీ నారా చంద్రబాబు నాయుడును టార్గెట్ చేయడం ఒక సంప్రదాయ ఆయుధంగా వస్తోంది. చంద్రబాబును బూచిగా చూపిస్తే

...మిగతాది 2 లో

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు

...మిగతాది 6 లో



# ఏసీబీ చేతిలో అవినీతి తిమింగళం

- **నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మల్లా రెడ్డి**
- **మల్లా రెడ్డి అక్రమాస్తుల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ ఏకంగా 11 ప్రత్యేక బృందాలు**

**జయభేరి, హైదరాబాద్, జూన్ 23 :**

తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటను యాంటీ కరప్షన్ బ్యూరో మరింత ఉధృతం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## రేవంత్ వరుస భేటీలు

మెట్రో ఫేజ్ II విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణాల సేకరణ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు.కన్సల్టెంట్‌గా SBICAPS ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్ I వాల్యూయేషన్, ఫేజ్ II విస్తరణతో పాటు ఇతర అంశాలపై SBICAPS సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ ముందుకు సాగేందుకు కృషి చేస్తారు. ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రైలు రెండో ఫేజ్ పై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన రుణాలు విడుదల చేయడం, రెండో దశ విస్తరణకు పూర్తి స్థాయిలో అనుమతులు, అవసరమైన నిధులను మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రిని కోరారు.

ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ కూడా పాల్గొన్నారు.రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బృందంతో పాటు ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం అవుతున్నారు. మొన్నటివరకూ ఉప్పు నిప్పులా సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు చేసుకుని, బహిరంగ లేఖలు రాసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం వీరిద్దరూ కలిసి ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో నిన్నటి నుంచి సమావేశం అవుతున్నారు. సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. బాపూఘాట్ వద్ద ప్రాజెక్టుకు రక్షణ భూములు కేటాయిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్ ఫోర్స్ ఎయిర్ పోర్టుకు సంబంధించి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మరోవైపు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ అయ్యారు.తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు కూడా మంగళవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం వారు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేయాలని కోరనున్నారు. ఆ తర్వాత కేంద్ర ఆరోగ్య, రసాయనాలు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాతో ప్రత్యేకంగా సమావేశమై, రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.

## డబుల్ ధమాకా

గ్రీన్ సిగ్నల్ లభించింది. మొత్తం 80 అంశాలకు ఆమోదం తెలిపింది. రూ.34 వేల కోట్ల పెట్టుబడులతో 35 వేల ఉద్యోగాల కల్పనకు ఆమోదం తెలిపారు. అలాగే జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణ పనులకు కూడా ఆమోదం లభించింది. కడప, అనంతపురం జిల్లాలలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహకాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

## పద్మశ్రీ అందుకున్న రోహిత్ శర్మ

దీంతో ఇప్పుడు అతడు పురస్కారం అందుకున్నాడు. తన సారథ్యంలో భారత క్రికెట్ జట్టుకు టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అందించినందుకు రోహిత్ శర్మ పద్మశ్రీకి ఎంపికయ్యాడు. భారత క్రికెట్‌కు విశేష సేవలందించినందున అతడిని కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారంతో గౌరవించింది. నలుపు రంగు సూట్‌లో వచ్చిన రోహిత్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కించి పురస్కారం అందుకున్నాడు. అవార్డు తీసుకునేందుకు వెళ్తే.. తిరిగి వచ్చే క్రమంలోనూ రోహిత్.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి నమస్కించాడు. పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో ఇక.. రోహిత్ కూడా చేరాడు. ఇప్పటికే సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, రాహుల్ ద్రవిడ్, గౌతమ్ గంభీర్, కపిల్ దేవ్, మహేంద్ర సింగ్ ధోని వంటి దిగ్గజాలు ఈ గౌరవాన్ని అందుకున్నారు. తాజాగా హిట్‌మ్యాన్ ఆ లిస్ట్‌లో చేరిపోయాడు. రోహిత్ శర్మ సరిగ్గా 19 ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు అంటే 2007లో జూన్ 23న భారత జట్టు తరపున తొలి మ్యాచ్ ఆడాడు. 19 ఏళ్ల తర్వాత ఇదే రోజు పద్మశ్రీ అందుకున్నాడు. రోహిత్ శర్మ.. టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి.. భారత్ తరపున కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఇటీవల అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో ఆడిన హిట్‌మ్యాన్.. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా అతడు ముందుకెళ్తున్నాడు.

## సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత

తెలంగాణ సమాజంలో కొంతవరకు పొలిటికల్ అడ్వాంటేజ్ పొందే అవకాశం ఉండేది. కానీ కవిత మాత్రం ఊహించని విధంగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసుకుని తన విమర్శల పదును పెంచారు. తెలంగాణకు, ఇక్కడి రాజకీయ సమీకరణాలకు పెద్దగా సంబంధం లేని పవన్ కల్యాణ్ చుట్టూ కవిత రాజకీయం తిప్పడం వెనుక ఏ రకమైన వ్యూహం ఉందో ఎవరికీ అర్థం కావడం లేదు.పవన్ కల్యాణ్‌పై పోరాటం చేయడం వల్ల కవితకు రాజకీయంగా కలిసి వచ్చే శక్తులు గానీ, సామాజిక వర్గాలు గానీ లేవు. పవన్ కల్యాణ్ ఎక్కడో అన్న మాటలను పట్టుకుని, వాటిని తెలంగాణకు ఆపాదించి, ఇక్కడి ప్రజలను భావోద్వేగాల వైపు రెచ్చగొట్టాలని ఆమె చూస్తున్నారు. దీని ద్వారా తన వ్యక్తిగత బలాన్ని, ఉనికిని పెంచుకోవచ్చని భావిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆమెకు లభిస్తున్న మద్దతు శూన్యం. పవన్‌ను వ్యతిరేకించడం ద్వారా తెలంగాణలో ఎలాంటి పొలిటికల్ డివిడెండ్స్ రావనే కనీస లాజిక్‌ను కవిత మిస్ అవుతున్నార. గతంలో లాగా ఆంధ్రా వర్సెస్ తెలంగాణ అనే అరిగిపోయిన ప్రాంతీయ సెంటిమెంట్ ఆయుధం ఇప్పుడు తెలంగాణ సమాజంలో పెద్దగా పనిచేయడం లేదు.

ముఖ్యంగా జెన్‌జీ, యువత అభివృద్ధి, ఉపాధిని కోరుకుంటున్నారు తప్ప ఇలాంటి కృత్రిమ వివాదాలను పట్టించుకోవడం లేదు.తెలంగాణలో ప్రస్తుతం ఉనికిలోనే లేని, క్షేత్రస్థాయిలో తమకు శత్రువే కాని పవన్ కల్యాణ్‌ను ఒక పెద్ద విలన్‌గా చిత్రీకరించి, ఆయనపై కవిత చేస్తున్న ఈ శైలి పోరాటం చాలా మందికి అపరిపక్వంగా, తెలివితక్కువతనంగా కనిపిస్తోంది. లేని శత్రువును సృష్టించుకుని యుద్ధం చేయడం వల్ల సమయం, శ్రమ వృథా అవ్వడమే తప్ప ఎలాంటి లాభం ఉండదు. ప్రశాంత్ కిషోర్ లాంటి వ్యూహకర్త ఖచ్చితంగా ఇలాంటి బలహీనమైన, కాలం చెల్లిన వ్యూహాలను కవితకు రికమండ్ చేసి ఉండరనేది స్పష్టమైన వాస్తవం. పీకే ఇచ్చిన గైడెన్స్‌ను పక్కనబెట్టి, సొంత ఆలోచనలతో పవన్ కల్యాణ్‌పై అనవసర యుద్ధానికి దిగడం కవితకు సెల్ఫ్ గోల్ లాగా మారుతోంది. ఇకనైనా ఈ లేని శత్రువుల చుట్టూ తిరిగే రాజకీయాన్ని పక్కనబెట్టి.. తెలంగాణ క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై, ఇక్కడి అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిర్మాణాత్మకంగా పోరాడితేనే కవితకు పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లేకపోతే జనసేన పార్టీ వర్సెస్ టీఆర్ఎస్ అన్నట్లుగా ఉనికి లేని రాజకీయం చేసుకోవాల్సి వస్తుంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

జయభేరి, వికారాబాద్ :

వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం ఘనాపూర్ గేటు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. టీవీఎస్ జూపిటర్ స్కూటీ, ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్ రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టీవీఎస్ జూపిటర్ వాహనదారుడు కత్రావత్ చంద్ర (65), దీప్లా నాయక్ తండా నివాసి తీవ్ర తలకు గాయాలపాలై మృతి చెందాడు. ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్పై ప్రయాణిస్తున్న గణేష్, కృష్ణ, (ముజాయిద్పూర్ గ్రామం) గాయపడ్డారు. క్షతగాత్రున్ని మెరుగైన చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక శక్తి..

### 10 ఏళ్లలో ఏడుగురు ప్రధానులు



ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన దేశం. పారిశ్రామిక విప్లవానికి పుట్టినిల్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు. అలాంటి బ్రిటన్ (యూకే) నేడు తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరున్న యునైటెడ్ కింగ్‌డమ్ ప్రస్తుతం వృద్ధి మందగమనం, అధిక రుణభారం, జీవన వ్యయాల పెరుగుదల, ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడి, వలసల సమస్యలు, ఉత్పాదకత తగ్గుదల వంటి అనేక సవాళ్లతో పోరాడుతోంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని కలిగి ఉన్న దేశం ఈ పరిస్థితికి ఎలా చేరుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం గత కొన్ని దశాబ్దాల విధాన నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఇంకా నిర్మాణాత్మక బలహీనతల్లో దాగి ఉంది.బ్రిటన్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న తీవ్ర అస్థిరత మరోసారి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బ్రిటన్ తాజా ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయకుండానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో గత 10 ఏళ్ల వ్యవధిలోనే బ్రిటన్ ఏకంగా ఆరుగురు ప్రధాన మంత్రులను మార్చినట్లయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఒక అగ్రదేశంలో ఈ స్థాయి రాజకీయ సంక్షోభం తలెత్తడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్థిరత్వంపై సరికొత్త చర్చకు దారితీస్తోంది. బ్రిటన్ రాజకీయాల చరిత్రను గమనిస్తే.. 2016 లో జరిగిన బ్రెక్సిట్ రెఫరెండం తర్వాత అక్కడ స్థిరమైన ప్రభుత్వం అనేది లేకుండా మారింది. నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ రాజీనామా తర్వాత తెరిసా మే, ఆపై బోరిస్ జాన్సన్, కేవలం 45 రోజులు మాత్రమే పదవిలో ఉన్న లిజ్ ట్రస్, ఆ తర్వాత భారత సంతతికి చెందిన రిషి సునక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు పదవుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇటీవలే లేబర్ పార్టీని భారీ విజయంతో అధికారంలోకి తెచ్చిన కీర్ స్టార్మర్ సైతం దేశంలోని ఆర్థిక సవాళ్లు, అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఐదేళ్ల పూర్తి టర్మ్ ముగియకుండానే తప్పుకోవడంతో బ్రిటన్ పతనావస్థకు ఈ సంక్షోభం అద్దం పడుతోంది. సరిగ్గా ఇదే 10 ఏళ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం సాధించిన రాజకీయ స్థిరత్వాన్ని ఇక్కడి పరిణామాలతో పోల్చి చూపిస్తున్నారు. లండన్ వీధుల్లో ప్రధానుల మార్పిడి ఒక ప్రహసనంగా మారిన తరుణంలో.. భారత్‌లో మాత్రం ఇదే దశాబ్ద కాలంలో కేవలం ఒకే ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో స్థిరమైన పరిపాలన సాగుతోంది. ఈ రాజకీయ స్థిరత్వమే అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థిక వృద్ధికి, దౌత్యపరమైన విజయాలకు ప్రధాన ఇంధనంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒకవైపు బ్రిటన్ వంటి సంప్రదాయ ప్రజాస్వామ్య దేశాలు నాయకత్వ మార్పులతో, విధానపరమైన అస్థిరతతో కొట్టుమిట్టాడుతుంటే.. భారతదేశం వరుసగా మూడోసారి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకుని స్థిరమైన విధానాలతో ముందుకు సాగుతోంది. కీర్ స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే ఉత్కంఠ నెలకొనగా.. గ్లోబల్ ఇన్వెస్టర్లు మాత్రం స్థిరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భారత్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.20వ శతాబ్దం మధ్య వరకు బ్రిటన్ తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేది. అయితే కాలక్రమేణా భారీ పరిశ్రమలు క్షీణించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఫైనాన్స్, బ్యాంకింగ్, సేవల రంగాలపై ఆధారపడిపోయింది. ప్రత్యేకించి లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఎదిగింది. కానీ ఈ మార్పు దేశంలోని మిగతా ప్రాంతాలకు సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. ఫలితంగా లండన్ అభివృద్ధి చెందుతుండగా, ఇతర ప్రాంతాలు వెనుకబడ్డాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి. అమెరికా ఆ తరువాత చైనా వంటి దేశాలు ఆర్థికంగా బలపడటంతో బ్రిటన్ తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోయింది. అయినప్పటికీ, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగం, విద్య, సాంకేతికత వంటి రంగాల ద్వారా ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని కొనసాగించింది.బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఉత్పాదక రంగం బలహీనపడటం. గత మూడు దశాబ్దాలుగా తయారీ పరిశ్రమల ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిశ్రమలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల దేశాలకు తరలిపోయాయి.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధికంగా ఫైనాన్షియల్ సర్వీసులపై ఆధారపడిపోయింది.ముఖ్యంగా లండన్ నగరం కేంద్రంగా బ్యాంకింగ్,ఇన్వెస్ట్‌మెంట్ రంగాలు విస్తరించాయి. కానీ ఈ రంగాలు దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయాయి.లండన్ సంపన్నంగా మారుతుంటే, ఇతర ప్రాంతాలు వెనుకబడిపోయాయి.2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రిటన్‌కు పెద్ద దెబ్బగా మారింది.బ్యాంకింగ్ రంగంపై అధిక ఆధారపడటం కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.ఆ తర్వాత ప్రభుత్వం భారీ వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం వల్ల ఆరోగ్యం, విద్య, స్థానిక సంస్థలు, సామాజిక సంక్షేమ రంగాలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి.ఈ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ప్రజా సేవల నాణ్యత క్రమంగా పడిపోయింది.బ్రిటన్ ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించడం,టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెంచడం,గృహ నిర్మాణాలను వేగవంతం చేయడం,విద్య నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం కీలకం.అలాగే ప్రాంతీయ అసమానతలను తగ్గించి లండన్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.బ్రిటన్ ఒక్కసారిగా కుప్పకూలిపోతున్న దేశం కాదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని నడిపించిన దేశం, నేడు తన ఆర్థిక భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది.ఈ సంక్షోభం నుంచి బయటపడగలదా లేదా అనేది రాబోయే సంవత్సరాల్లో తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మాత్రం బ్రిటన్ ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది.



## రియల్ ఎస్టేట్ మార్కెట్ కు మళ్లీ రెక్కలు!

జయభేరి, హైదరాబాద్, జూన్ 23 :

హైదరాబాద్ మహానగర శివార్లలోని పర్యావరణ పరిరక్షణ జోన్ అయిన జీవో 111 పరిధిలోని 84 గ్రామాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ఈ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం లేదా భారీగా సడలింపులు ఇచ్చే అంశంపై ఏర్పాటైన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ నివేదికలను ప్రభుత్వం సుదీర్ఘంగా పరిశీలిస్తోంది. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య నిర్మాణాలకు వీలుగా కొత్త జోనింగ్ నిబంధనలను తీసుకురావాలనే ప్రతిపాదనలపై సచివాలయ వర్గాల్లో ముమ్మర చర్చలు సాగుతున్నాయి.చారిత్రాత్మక జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వరద మార్గాలకు, పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా బ్యాలెన్స్ పాటించడంపై ఈ వారంలో ఉన్నతాధికారులు కీలక సమీక్షలు నిర్వహించారు. జలాశయాల్లోకి మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయ డ్రైనేజీ నెట్‌వర్క్ , అత్యాధునిక మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ 1.32 లక్షల ఎకరాల పరిధిలో కేవలం 10 శాతం విస్తీర్ణంలోనే గ్రీన్ బిల్డింగ్స్, లగ్జరీ విల్లా ప్రాజెక్టులకు అనుమతులిచ్చి, మిగిలిన 90 శాతం ల్యాండ్‌ను గ్రీన్ జోన్ లేదా కన్జర్వేషన్ జోన్‌గా ఉంచే వ్యూహంపై అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సానుకూల పరిణామాలతో పశ్చిమ హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్ బెల్ట్‌లో ల్యాండ్ లావాదేవీలు అకస్మాత్తుగా ఊపందుకున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా ఇక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగించినట్లు కనిపించినా, జీవో సడలింపుల వార్తలతో ఇన్వెస్టర్లు, పెద్ద పెద్ద డెవలపర్లు మళ్లీ వెంచర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండే వట్టినాగులపల్లి, ఖానాపూర్, జన్వాడ, అజీజ్‌నగర్ వంటి గ్రామాల్లో ఓపెన్ ప్లాట్లు, ఫామ్‌ల్యాండ్స్ కొనుగోలుకు దేశీయ, ఎన్నారై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.ఒకవైపు జీవో 111పై ప్రభుత్వ నిర్ణయం సానుకూలంగా వస్తున్నప్పటికీ, కొనుగోలుదారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. నగరంలో చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలపై హైడ్రా' గట్టి నిఘా ఉంచడం, సీసీటీవీల ద్వారా లైవ్ మానిటరింగ్ చేస్తుండటంతో భూముల సరిహద్దుల విషయంలో స్పష్టత ఉన్న వెంచర్లకే మొగ్గు చూపుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అధికారికంగా జీవో సడలింపుల ఉత్తర్వులు జారీ చేస్తే గనుక, ఈ ప్రాంతం హైదరాబాద్‌లోనే అతిపెద్ద ప్రీమియం అండ్ ఎకోఫ్రెండ్లీ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారడం ఖాయమని క్రెడాయ్ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

## ఏసీబీ చేతిలో అవినీతి తిమింగళం

కె. మల్లా రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఏకకాలంలో మెరుపు దాడులు ప్రారంభించారు. మల్లా రెడ్డి అక్రమాస్తుల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ ఏకంగా 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. హైదరాబాద్‌లోని మాచ బొల్లారంలో ఉన్న ఆయన నివాసంతో పాటు నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయం, నివాసాలపై అధికారులు విరుచుకుపడ్డారు. వీటితో పాటు మల్లా రెడ్డికి అత్యంత ఆప్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వారి ఇళ్లు, వ్యాపార సంస్థల్లోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. తన అధికారిక ఆదాయ వనరులకు మించి మల్లా రెడ్డి భారీగా ఆస్తులను కూడబెట్టారనే బలమైన ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తులో ఆయన పెద్ద ఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో, కోర్టు అనుమతితో ఈ సర్ప్రైజ్ రైడ్స్ ప్లాన్ చేశారు. సోదాల సందర్భంగా అధికారులు ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ పాస్‌బుక్కులు, బంగారు ఆభరణాలు, భారీగా నగదును గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంకు లాకర్ల వివరాలు, ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను ఏసీబీ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మల్లా రెడ్డి సర్వీస్ కాలంలో సంపాదించిన చట్టబద్ధమైన ఆదాయానికి, ప్రస్తుతం దొరికిన ఆస్తుల విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కగట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారుఒక కీలక జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అధికారి నివాసాలపై ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగడం కలకలం రేపుతోంది. సోదాలు పూర్తిగా ముగిసిన తర్వాత మల్లా రెడ్డి అక్రమాస్తుల అసలు విలువ ఎంత? ఎక్కడెక్కడ బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారు? అనే పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు. అక్రమాలు రుజువైతే ఆయనపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మెట్రో కష్టాలు ఇంతింతకాదయా

ప్రభుత్వం ఇప్పుడు ఐఆర్ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా రీఫైనాన్సింగ్ చేయాలని చూస్తోంది. దీనిలో 4% వడ్డీకి జపాన్ నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం ఎఫ్ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనల ప్రకారం రుణం తీసుకోవాలని సూచిస్తోంది. ఇలా చేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా దెబ్బతింటుంది. ఉద్యోగుల జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడవచ్చు. రాష్ట్ర హామీతో రుణం తీసుకుంటే అది రాష్ట్ర బడ్జెట్‌పై భారం అవుతుంది. ఇది టేకోవర్‌ను ఆర్థికంగా సవాలుగా మార్చింది.మెట్రో ఫేజ్-2 (సుమారు 123 కి.మీ.,రూ.38,595 కోట్లు) కోసం రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు, ఆమోదాలు కోరుతున్నారు.

ఇంతకు ముందు 50:50 భాగస్వామ్యంగా ఒప్పందం జరిగిందని చెబుతున్నారు. కానీ యూనియన్ మినిస్టర్ గిరి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఫేజ్-2కు నిధులు తీసుకురావడం ద్వారా టేకోవర్ బకాయిలు చెల్లించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. కిషన్ రెడ్డి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పాటించడం లేదు, ఆర్థిక బాధ్యతలు తీసుకోవడం లేదు అని ఆరోపిస్తున్నారు. వాదనలు వస్తున్నాయి. ఇది కేంద్ర-రాష్ట్ర రాజకీయాల్లో భాగమైంది.మెట్రో ఫేజ్-2 విస్తరణ ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చు. అయితే ఆర్థిక భారం, రుణాలు, కేంద్ర నిబంధనలు ఇది సులభం కాదని చూపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టేకోవర్‌ను గొప్ప విజయంగా చిత్రించి, తర్వాత కేంద్రం మీద బాధ్యత వేయడం రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. అదే సమయంలో కిషన్‌రెడ్డి, కేంద్రం వైపు నుంచి రాష్ట్రం నిబంధనలు పాటించాలని, ఆర్థిక బాధ్యత తీసుకోవాలని ఒత్తిడి చేయడం సహజం. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సినది. రాజకీయ ఆరోపణలు, డైవర్షన్‌లు పక్కన పెట్టి, ఆర్థిక వాస్తవాలు, ప్రజా ప్రయోజనం ఆధారంగా ముందుకు సాగాలి. హైదరాబాద్ వంటి నగరానికి మెట్రో విస్తరణ అవసరం ఉంది, కానీ అది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా జరగాలి.ఇలాంటి పెద్ద ప్రాజెక్టుల్లో రాజకీయాలు అనివార్యం. కానీ ప్రజలు ఫలితాలు చూడాలని కోరుకుంటారు. మెట్రో విస్తరణ, మెరుగైన రవాణా. రెండు పక్షాలు సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలి. అప్పుడే ఈ టేకోవర్ నిజమైన అభివృద్ధికి దారితీస్తుంది.

# అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న పోలీసులు

జయభేరి, తుర్కపల్లి, జూన్ 23 :

అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో జరిగింది .మంగళవారం డిఎస్పి శ్రీనివాస్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారంపై తుర్కపల్లి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్సు స్టాండ్ ముందర దొండపాడు మల్లికార్జునరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు, అతను గుంటూరు నుండి సిద్దిపేట వరకు నిషేధిత బిజీ 11 పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించి అతనిని విచారించగా ఏ 1 దొండపాటి మల్లికార్జున్ రావు, చిత్తూరు జిల్లాకు చెందిన ఎ 2 శంకర్ తో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నకిలీ బిజీ11 పత్తి విత్తనాలను కొనుగోలు చేసి రవాణా చేసి విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైందని పోలీసులు ప్రశ్నించగా తాము రైతులకు అధిక దిగుబడి వస్తుందని, మంచి పంట ఉత్పత్తి కలుగుతుందని తప్పుడు సమాచారం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు ఒప్పుకున్నారు. మొత్తం ఐదు సంచుల్లో ఉన్న బిల్లా బిజీ 11999 పేరుతో నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు 70 కిలోలు, రెండు సంచులు విడివిడిగా ఉన్న నకిలీ కల్తీ పత్తి విత్తనాలు 80 కిలోలు మూడు సంచులు స్వాధీనం చేసిన విత్తనాల నిల్వ రవాణా విక్రయాలకు సంబంధించి నిందితుడు ఎటువంటి




చెల్లుబాటు అయ్యే లైసెన్సు, బిల్లులు, ఇన్వాయిస్లు, రవాణా అనుమతులు స్టాక్ రిజిస్టర్లు లేదా అధికార పత్రాలు సమర్పించలేకపోయారు. పరారీలో ఉన్న s2 శంకర్ను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.
ఇలాంటి నిషేధిత నకిలీ పత్తి విత్తనాల వినియోగం వల్ల విత్తనాల మొలక శాతం తగ్గిపోవడం పంటలు విఫలం అవడం రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చెవిచూడాల్సి నా పరిస్థితి ఏర్పడవచ్చు అని ఈ నకిలీ విత్తనాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండవని వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఇలాంటి విత్తనాల నిరంతర వినియోగం భూసారాన్ని దెబ్బతీయటమే కాకుండా నేల కాలుష్యానికి కూడా దారి తీయవచ్చని,రైతులు అందుకు పురుగల మందులు ఎరువులు తిరిగి విత్తనం కోసం అధిక ఖర్చు చేయాల్సి రావడంతో సాగు వేయం పెరుగుతుందని అన్నారు. ఈ విధమైన అక్రమ కార్యకలాపాలు రైతు సమాజానికి వ్యవసాయ రంగానికి తీవ్రమైన ముప్పు మారుతుందని అన్నారు. భువనగిరి జిల్లా పోలీసులు రైతులకు భారీ ఆర్థిక నష్టం కలిగించే నకిలీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నకిలీ విత్తనాల తయారీ రవాణా విక్రయాల్లో పాల్గొంటున్న ముఠాలను గుర్తించి నిర్మూలించేందుకు నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. నకిలీ విత్తనాల నిల్వ విక్రయం లేదా రవాణా గురించి విశ్వసనీయ సమాచారం తెలిపిన రైతులు ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఈ ఆపరేషన్ లో జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, ప్రత్యక్ష పర్యవేక్షణలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకర్ గౌడ్, తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తకియొద్దీన్, మండల వ్యవసాయ అధికారి శ్రీ ఉమా, మండల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బాలాంజనేయ స్వామికి పూజలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లోని శ్రీ బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి దేవస్థానం అర్చకుడు రాజమూరి హనుమేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. వివిధ అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశేష దినోత్సవ సందర్భంగా స్వామివారి మూల విరాట్ ను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని ఆయా మండలాలలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 9:30 గంటలకు భూత్పూర్ మండలం బట్టుపల్లిలో శివాలయం ధ్వజస్తంభం ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు కౌకుంట్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేల కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు మదనాపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో కూడా విత్తనమేల కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# దేవరకద్రకు.. బ్రహ్మోస్..

- దేవరకద్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం..
- బ్రహ్మోస్ వస్తే.. భారీ ఉపాధి..
- ఫలించిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కృషి
- ఎమ్మెల్యేకు ప్రజల అభినందనల వెల్లువ
- మిస్సైల్ కేంద్రం వస్తే 5000 మందికి ఉపాధి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి, ముఖ్యమంత్రిలకు ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు

జయభేరి, దేవరకద్ర :






బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రం వస్తే భారీ ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ విషయంలో ఆశాజనక సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మిస్సైల్ కేంద్రం మంజూరు విషయంలో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కృషి ఎంతగానో ఉంది. దీంతో ఆయనకు ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. దేవరకద్ర మండలంలో బ్రహ్మోస్ మిసయిల్ కేంద్రం ఏర్పాటుకై సంపూర్ణ సహకారం అందించిన రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాలమూరు జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలంలో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ రాబోతుంది. దానికి కావలసిన 400 ఎకరాల స్థలం విషయం టీజిఐఐసీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి, సీఎం రేవంత్ భేటీలో చర్చకు రావడం జరిగింది. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం, దేవరకద్ర మండలంలోని బస్వాయపల్లి చౌదర్ పల్లి గ్రామాల మధ్య 400 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. దీనిని ఉచితంగా అప్పగించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది.టీజిఐఐసీ నుంచి కూడా ఈమేరకు రక్షణ శాఖకు లేఖ కూడా రాయడం జరిగింది. గత ఏడాది బ్రహ్మోస్ డి ఆర్ డి ఓ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు చౌదర్ పల్లి భూముల్లో పర్యటించడం జరిగింది.బ్రహ్మోస్ క్షిపణుల పరిశోధన, తయారీకి ఈ ప్రాంతం అనుకూలమే అని సంకేతాలు కూడా అప్పట్లో ఇచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది.అదనంగా మరో 100 ఎకరాలు అవసరమైతే కూడా భూ సేకరణ సులువుగా పూర్తవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి దేవరకద్ర శాసన సభ్యులు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విజ్ఞపి ఇదివరకే చేయడం జరిగిందన్నారు.

# అందుబాటులో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు

- నిర్మల ఆసుపత్రితో కూరపాటి లాప్రోస్కోపిక్ సెంటర్ ఎంఓయూ
- తొర్రూరు కేంద్రంగా అందుబాటు ధరల్లో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు

జయభేరి, తొర్రూరు, జూన్ 23 :




రోగులకు ప్రయోజనం చేకూర్చే మినిమల్లీ ఇన్వేసిన్ విధానాన్ని కలిగి ఉన్న లాప్రోస్కోపిక్ ఆపరేషన్లను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు కూరపాటి అడ్వాన్స్డ్ లాప్రోస్కోపిక్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కూరపాటి రమేష్, నిర్మల ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రంజిత్ కుమార్ లు తెలిపారు.అధునాతన ఆపరేషన్లు నిర్వహించేందుకు తొర్రూర్ లోని నిర్మల ఆసుపత్రితో హనుమకొండ కూరపాటి అడ్వాన్స్డ్ లాప్రోస్కోపిక్ సెంటర్ ఎంవోయూ కుదుర్చుకుంది.ఈ మేరకు మంగళవారం పట్టణంలోని నిర్మల ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎం ఓ యు ఒప్పంద పత్రాలను నిర్మల ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రంజిత్ కుమార్,కూరపాటి రమేష్ లు పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరు వంటి గ్రామీణ ప్రాంతాలకు సైతం అధునాతన లాప్రోస్కోపిక్ సేవలు అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో కూరపాటి లాప్రోస్కోపిక్ సెంటర్తో నిర్మల ఆసుపత్రి ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. సంప్రదాయ ఆపరేషన్లకు భిన్నంగా లాప్రోస్కోపిక్ విధానంలో చిన్నపాటి రంధ్రాల సాయంతో జల్లెడ లాంటి మిషన్ ను అమర్చి సులువుగా హెర్నియా వంటి సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. లాప్రోస్కోపిక్ పద్ధతిలో పెద్ద ఆపరేషన్ల మాదిరి వారాల తరబడి ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదని, చాలావరకు ఆపరేషన్లు చేసిన 24 నుండి 48 గంటలలోపు రోగిని డిశ్చార్జ్ చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పిత్తాశయం తొలగింపు, అపెండిసైటిస్, హెర్నియా, గర్భాశయ సమస్యలు (గడ్డలు, ఫైబ్రాయిడ్స్), మరియు బేరియాట్రిక్ (బరువు తగ్గించే) సర్జరీలకు ఈ లాపరోస్కోపిక్ విధానాన్నే ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. నిర్మల ఆసుపత్రి కేంద్రంగా లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎం ఓ యు దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బి.శృతి తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 23:

యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. మొహర్రంను ప్రపంచ వ్యాప్తంగా సంతాప దినాలుగా కొలుస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో మాత్రం హిందువులు,ముస్లింలు కలిసి మొహర్రం సందర్భంగా పీర్ల పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పీర్లను నిలబెట్టి మటికీలు తీసి డబ్బుచప్పుళ్ల మధ్య ఊరేగిస్తున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీ, గుండ్లపల్లి, యాదగిరిపల్లి, గణేష్నగర్తో పాటు మండలంలోని మాసాయిపేట, సైదాపురం, గౌరాయపల్లి, వంగపల్లి, రాళ్లజనగాం,దాతారుపల్లి, చిన్నకందుకూరు, పెద్దకందుకూరు,బాహుపేట, తాళ్లగూడెం, సాదువెల్లితో పాటు తదితర గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా పీర్లను ఎత్తుకొని సంతోషంగా గడుపుతున్నారు.

## ప్రాథమిక పాఠశాలలో బాలసభ కార్యక్రమం



జయభేరి, తుర్కపల్లి, జూన్ 23 :

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలసభ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కర్రే మాధవి కరుణాకర్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాలల విద్య వ్యక్తిత్వం వికాసం, క్రమశిక్షణ నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు కొడపాక అక్షిత మహేష్, నార నాగరాజు, పల్లెపాటి అనిల్, గుంటి లావణ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల దశరథ, అంగన్వాడి టీచర్ నారా స్వప్న, ఆశ వర్కర్ ఆరుట్ల వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు, గ్రామపంచాయతీకి కంప్యూటర్ల విరాళం




జయభేరి, తుర్కపల్లి, జూన్ 23 :

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన ఆలువల ఎల్లయ్య తమ్ముడు నవీన్ జ్ఞాపకార్థం రెండు కంప్యూటర్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, గ్రామపంచాయతీకి కంప్యూటర్లు అలువాల వెంకటేశం అందజేయడం అభినందనీయమని సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ అన్నారు. నేటి డిజిటల్ కంప్యూటర్ విద్య ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కంప్యూటర్ను అందించడం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకునే అవకాశం కల్పించాలని అన్నారు. సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమైన సాధనమని గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలంటే అవసరమైన వనరులు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ లక్ష్యంతో పాఠశాలకు కంప్యూటర్ను విరాళంగా అందజేయడం వెంకటేష్ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ ఎరుకల స్వామిగౌడ్ పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘ నిబంధనలను పాటించాలి

- తహసిల్దార్ రవికుమార్



జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :

ఎన్నికల సంఘ నిబంధనలు పాటించాలని తహసిల్దార్ రవికుమార్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో గుర్తింపు పొందిన కేంద్ర రాష్ట్ర పార్టీల ద్వారా క్షేత్రస్థాయిలో బూతుల వారీగా స్వచ్ఛమైన ఓటర్ జాబితాను తయారు చేయడంలో బిఎల్ఓ లకు సహాయం చేయుటకు నియమించబడిన బిఎల్ఎ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఏలు వారి విధుల్లో భాగంగా ఏవిధంగా ఓటర్ జాబితాను పరిశీలించాలి, కొత్త ఓటర్లను ఎలా నమోదు చేయాలి, తప్పులను గుర్తించి ఏ విధంగా సరి చేయాలి, అర్హులైన ఓటర్ల పై అభ్యంతరాలు ఏవిధంగా ఇవ్వాలి, సర్ 2026 ఎన్నిమరేషన్ ఫారంలు ఎలా ఓటర్లకు అందించాలి ఎలా స్వీకరించాలి, ఎన్నికల సంఘం నిబంధనలు ఏ విధంగా పాటించాలో అవగాహన కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాలకు చెందిన బిఎల్ఏలు, ట్రైనర్ అశోక్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఉండాలంటే.. చేసిన తప్పులకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ప్రజలు తీర్పు ఇచ్చినా కేటీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదు
- అధికారంలో చేసిన తప్పులకు కేటీఆర్ జవాబు చెప్పాలి
- ఫామ్‌హౌస్ రైడ్‌పై వచ్చిన ఆరోపణలకు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సమాధానం చెప్పాలి
- మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలకు ముందుగా జవాబు ఇవ్వండి
- కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదు
- రౌడీయిజానికి పరకాలలో స్థానం లేదు, ప్రశాంతమైన పాలనే నా నిబద్ధత
- ప్రజల విశ్వాసమే నా విజయానికి బలం, ప్రజల మద్దతుతోనే గెలిచా, డబ్బులతో రాజకీయాలు చేయలేదు
- పాపాలు కడుక్కోవడానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారు
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం



**జయభేరి, పరకాల, జూన్ 23:**

మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేటీఆర్ యొక్క బిఎల్ఎ ల ట్రైనింగ్ తక్కువ కాంగ్రెస్ పార్టీని, నాయకులను దూషించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. బిఆర్ఎస్ నాయకుల తిట్ల పురాణం, అబద్దాల పురాణం, వారి తప్పిదాలనుకప్పిపుచ్చుకోవడానికేనని, మాట్లాడే దాంట్లో వాస్తవం లేదన్నారు. కెసిఆర్ అనే మూడు పదాలు లేనిది తెలంగాణ లేదని అంటున్న కేటీఆర్ పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టిన నాడు మీ అయ్యా ఎక్కడ పడుకున్నాడో అని అడిగారు. బిఆర్ఎస్ పాలనలో ఏం చేశారో చెప్పే ధైర్యం లేకనే తిట్ల పురాణం మొదలుపెట్టాలని, రైతులకు ఇచ్చిన వాగ్దానాలు మరిచిపోయి నిరుద్యోగ యువత ఉసురు పోసుకున్నారు అని అన్నారు. 16వేల కోట్ల మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసి మీరు మాత్రమే బాగుపడ్డారు అని అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు ఒప్పుకొని ఉంటే రాబోయే ఎన్నికలలో ఒకటో రెండో సీట్లు గెలుస్తారని కానీ జీరోగా మారారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ ఆర్థిక వ్యవస్థను సర్దిద్దుకుంటూ రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా మీ టిఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకోవాలి అంటే టిఆర్ఎస్ పాలనలో చేసిన తప్పులను గుర్తించి ప్రజలకు క్షమాపణ చెప్పండి అని సలహా ఇచ్చారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫామ్‌హౌస్ రైడ్‌పై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలి, పోలీసు విచారణకు ఎందుకు హాజరయ్యారో ప్రజలకు వివరించాలి అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నీ గురించి మాట్లాడిన విషయము మర్చిపోయావా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి. నీ బండారాన్ని కవిత సాక్షాదారాలతో సహా చెప్పింది. మీ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి నాపై ఆరోపణలు చేయడం విలువలు లేకుండా ప్రవర్తించడమే అని అన్నారు. వరికోల్ గ్రామంలో కమ్యూనిటీ హాల్ కు ఎంపీ నిధులతో కట్టించి నీ సొంత డబ్బులతో కట్టినట్లుగా చెప్పి ప్రారంభించడం నీకు విలువలు ఎక్కడైనా ఉన్నాయా. నర్సంపేట లో నేను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా హనుమకొండలో పోటీ చేశా ఓటింగ్ ఎంత పెరిగిందో తెలుసుకో 1994కంటే ముందు ఉన్న నా ఆస్తులు ఇప్పుడు తరిగినవి పెరగలేదు. నీ వరికోలు గ్రామంలో సర్పంచ్ని గెలిపించుకోవడానికి నీవు చేసిన దరిద్రం ఏంటో, దిగజారి వ్యవహరించిన పద్ధతి ఏంటో ప్రజలకు తెలుసు అని అన్నారు. నీ పాపాలను కడుక్కోవడానికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నావ్, నీలాంటి దిగజారుడు వ్యక్తులతో చర్చకు రావడమా అని ప్రశ్నించారు. 100 బర్లను తిన్న రాబందు మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి మాట్లాడుతున్నాడని చంద్రగిరిగుట్టలో నీవు చేసిన నిర్వాహకం ప్రజలకు తెలవదా అన్నారు. నిబద్ధత కలిగిన నిజాయితీగల వ్యక్తిని కాబట్టి నేను ఎక్కడ పోయినా ప్రజలు ఆదరిస్తున్నారు నేను ప్రజల మనిషిని కాబట్టే గెలుస్తున్నాను అని తెలిపారు. మీలాగా డబ్బులు ఖర్చు పెట్టి రాజకీయాలు చేయలేదు, నీ బిఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసే పార్టీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని, నీవు ఎన్నికల ముందు మోసం చేయడానికి గృహలక్ష్మి ఇండ్లు ఇచ్చారన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ గురించి మాట్లాడే నైతిక అర్హత మీకు లేదనీ, నేను టెక్స్టైల్ పార్కులో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి కృషి చేస్తున్నానన్నారు. 15 కోట్లు మీ టిఆర్ఎస్ పార్టీ తీసుకున్నది అబద్ధమా? కాంట్రాక్టు పనులు చేసి సంపాదించినది నిజం కాదా? అని ధర్మారెడ్డిని నిలదీశారు. వారి దగ్గర టి కూడా తాగలేదని ఇది మా నిబద్ధత నిదర్శనమని అన్నారు. నియోజకవర్గ ప్రజలే నీ దోపిడీని బహిరంగంగా చర్చించుకున్న విషయం నిజం కాదా అని, రోడ్డు మీద పోయే కుక్కలతో చర్చకు మేము రాము అని అన్నారు. మేం నీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నామా కేటీఆర్? మీ పాలనలో మా కాంగ్రెస్ కార్యకర్తపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. రౌడీయిజానికి ఇక్కడ తావు లేదు ప్రజలు ఎవరి బతుకులు వారు ప్రశాంతంగా బతికేలా నా పాలన ఉంటుంది అది నా నిబద్ధత నేను చేసిన అభివృద్ధిని ప్రశ్నించే అర్హత మీకు లేదు. మీ పాలనలో చేపట్టిన పనులకు బిల్లులు కూడా ఇవ్వలేదు నేను వచ్చిన తర్వాతనే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులకు మేమే శంకుస్థాపనలు మేమే ప్రారంభోత్సవాలు చేస్తున్నాం. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని బిఆర్ఎస్ నాయకుల తీరు దొంగే దొంగ అన్నట్టుగా ఉందని అన్నారు.



## విత్తన మేళాను ప్రారంభించిన చందుపట్ల రాజిరెడ్డి, ఏఎంసి చైర్మన్

- ప్రభుత్వానికిరైతు సంక్షేమమే ధ్యేయం
- పరకాల, నడికుడ రైతు వేదికలో ఘనంగా విత్తన మేళా ప్రారంభం

**జయభేరి, పరకాల, జూన్ 23:**

పరకాల, నడికుడ మండలాల రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాల స్టాళ్లను ఏర్పాటు చేసి, విత్తన మేళాను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ మేళాలో రైతులకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకొని, ముందస్తు ప్రణాళికతో పంటలు వేసి మంచి దిగుబడులు సాధించాలని కోరారు. అలాగే బోనస్ కు అనుకూలమైన పంటలను వేస్తూ అధిక లాభాలను అధిక దిగుబడులను పొందాలని, సకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఆధునిక వసతులను కల్పిస్తూ ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి లకు పరకాల, నడికుడ మండల రైతాంగం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయఅధికారులు, మండల వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఫర్టిలేజర్ యజమానులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు, పెన్షనర్లకు నూతన హెల్త్ కార్డులు అందజేయాలి




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సమావేశంలో సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్ల మే నెల జీతం నుండి 1.5 శాతం కోత విధించి ఇంత వరకు హెల్త్ కార్డులు అందజేయకపోవడం, విదివిధనాలు రూపొందించకపోవడం, హాస్పిటల్స్ ఎన్నిక చేయకపోవడం వల్ల ఉద్యోగులు, పెన్షనర్స్ చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ వెంటనే స్పందించి హెల్త్ కార్డులు, వైద్యాశాలల లీస్ట్ అందజేయాలని కోరినారు. కార్యవర్గ సభ్యుడు సపావత్ నందులాల్ రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ 63వ పుట్టినరోజు వేడుక నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా నందులాల్ మాట్లాడుతూ తన కుమారుడు అమెరికా నుండి జులై మాసంలో రాగానే మన సేవాసధానమునకు ఆర్థిక సహాయం చేస్తానని, నా పుట్టినరోజు ఇంత ఘనంగా నిర్వహించినందుకు మిత్రులకు ధన్యవాదములు తెలియజేసినారు. పసందైనా భోజనము ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంనకు కోశాధికారి పంగునూరు లింగయ్య, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గం, కార్యవర్గం సభ్యులు, సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దక్షిణ ఎనర్జీ కంపెనీలో ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



**జయభేరి, పరవాడ :**

పరవాడ మండలం జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీ అనుకొని ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో దక్షిణ ఎనర్జీ కంపెనీలో జరిగిన విషాదకర ప్రమాద ఘటన స్థలాన్ని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సేఫ్టీ ఆడిట్ తరచూ నిర్వహిస్తూ ఉద్యోగులకు భద్రత ప్రమాణాలు మరింత మెరుగైన అందించాలి. ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులతో కలిసి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నియమించి తరచూ బద్రత ప్రమాణాలు పై తనిఖీలు చేయాలి. ఈ విషాద సమయంలో వైఎస్సార్సీపీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని అన్ని అన్నారు వారితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర రావు, బొద్దపు చిన్నారావు, మాజీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ దళాయి నదియా, పెద్దిశెట్టి శేఖర్, బోండా కనక రావు, మెంతి మహేష్, వద్దాది అప్పలరాజు, కర్రి నర్సింగ్ రావు, గొన్న హేమ చంద్ర తదితరులు ఉన్నారు.

# వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

- కొత్తూరు అండర్ పాస్ ను పరిశీలించినఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి
- హాజరైన డిసిపి శిరీష రాఘవేందర్,ఏసీపీ లక్ష్మీనారాయణ



**జయభేరి, షాద్ నగర్, జూన్ 23 :**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధిలోని వర్షాకాలంలో అండర్ పాస్ లో నీరు నిల్వకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సూచించారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీలో అండర్ పాస్ ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి,డిసిపి శిరీష రాఘవేందర్,ఏసీపీ లక్ష్మీనారాయణ,సిఐలు నరసయ్య,శంకరయ్య తో కలిసి పరిశీలించి నేషనల్ హైవే అడ్వైజర్ భాను ప్రకాష్ కు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ....వర్షాకాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అండర్పాస్ లో నీరు నిలవకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని కమిషనర్ తరుణ్ జోషి చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యశిలారెడ్డి,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో వితంతువులు ధైర్యంగా బ్రతకాలి

- దంతాలపల్లి ఎస్సై రవికుమార్




**జయభేరి, దంతాలపల్లి, జూన్ 23 :**

బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మండలంలోని దంతాలపల్లి గ్రామంలో 150 మంది 14 గ్రామాల నుండి దంతాలపల్లి పడమట గూడెం దాట్ల నరసింహుల పేట పెద్ద నాగారం చిల్లంచర్ల జయపురం పెద ముప్పారం రామవరం కుమ్మరి కుంట్ల రేపుని ప్రాంతంలో గున్నేపల్లి ఆగపేట గ్రామాల నుండి వచ్చినటువంటి వారితో వితంతువుల దినోత్సవం జరిగింది దీనిలో భాగంగా స్థానిక ఎస్సై రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎంతో మంది వితంతువులు చాలా బాధపడుతుంటారు వారికి నేను అండగా నిలబడతాను ఎలాంటి సమస్య వచ్చినా వాళ్లకి నేను నా వంతు సహాయం ఎలాంటిదైనా చేస్తానని చెప్పడం జరిగింది, సమాజంలో వితంతువులు ధైర్యంగా బ్రతకాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమానికి వీరబోయిన సుధాకర్ మాట్లాడుతూ బాలవికాస ఎన్నో కార్యక్రమాలు చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు కూడా చాలా చేస్తూ ఇట్లాంటి ప్రోగ్రాం ఎలాంటి గవర్నమెంట్ కూడా చేయని పని బాలవికాస చేస్తారని ఇంత అద్భుతంగా చేసిన బాలక్కకు ధన్యవాదాలు అని చెప్పడం జరిగింది వితంతువులందరికీ కోఆర్డినేటర్స్ కందునూరి సుకన్య మార్గం శోభారాణి స్వర్ణలత చిలక మారి యాక లక్ష్మి బొట్టు పూలు గాజులు పెట్టడం జరిగింది అరటి పండ్లు బిస్కెట్స్ ఇవ్వడం జరిగింది అరటి పండ్లు పంపిణీ చేశారు దోనరుగా ఇవ్వడం జరిగింది ఆలంపల్లి హిమాదేవి గారు బొట్టు పూలు గాజులుఇవ్వడం జరిగింది విలేజ్ లీడర్స్ అంకం వెంకటరత్నమ్మ బండి సోమక్క సుభద్ర ఎస్కే చాంది బి కుంభాల నాగలక్ష్మి తుమ్మ నాగలక్ష్మి ధర్మారపెల్లమ్మ పోలూరు సావిత్ర మిగతా సభ్యులు పాల్గొన్నారు

## గుడిపల్లి పిఏసిఎస్ లో సెల్ పాయింట్ ను ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్, గ్రామ సర్పంచ్




**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండలం లో గుడిపల్లి పిఏసిఎస్ సెల్ పాయింట్ ను ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్ తేరా మణిపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి గుడిపల్లి మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ రాజు సంబంధిత రైతులకు యూరియా బుకింగ్ చేసుకున్న వారికి యూరియా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సీఈఓ ప్రభాకర్, సింగరాజు పల్లి సర్పంచ్ సూరబోయిన శ్రీనివాస్, గుడిపల్లి ఉపసర్పంచ్ ఆర్వపల్లి శ్రీనయ్య, ఉమ్మడి పీఏ పల్లి వైస్ ఎంపీపీ ఆర్వపల్లి సరిత నరసింహ, పిఏసిఎస్ డైరెక్టర్ సైదులు, మాజీ సీఈవో వెంకటేశ్వర్ రెడ్డి, గుడిపల్లి మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ABVP పిలుపుతో విజయవంతమైన పాఠశాలల బంద్

- డిఆర్ఎస్ (D R S) ప్రైవేట్ పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం చేసిన - ఏబీవీపీ

**జయభేరి, దేవరకొండ :**

ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై వెంటనే స్పందించాలి - తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు ఈరోజు ఏబీవీపీ దేవరకొండ శాఖ పరిధిలో ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలలు విజయవంతంగా బంద్ నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా దేవరకొండ పరిధిలోని డిఆర్ఎస్ (DRS) అనే ఒక్క ప్రైవేట్ యాజమాన్యం సమాచారా లోపంతో పాఠశాల నడపగా అక్కడికి ఏబీవీపీ కార్యకర్తలు వెళ్లి పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం చేయడం జరిగింది. అదేవిధంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ వెలమల గోపీచంద్ మాట్లాడుతూ, విద్యార్థుల హక్కులు మరియు నాణ్యమైన విద్య కోసం ABVP నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిమాండ్స్ 27,000 ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000 ల స్కూళ్లను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. ఖాళీగా ఉన్న MEO, DEO పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ వెంటనే అందించాలి. గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి. ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి. ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్, యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్ళలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ తక్షణమే అమలు చేయాలి. విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు ABVP ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర జాయింట్ సెక్రెటరీ గుండాల శివరామరాజు, యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, ఇస్లావత్ రామ్ చరణ్, సాయి, బిట్టు, హరి, అరవింద్, శివ, రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.


# దక్షిణ్ ఎనర్జీ ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అదుకొంటాం ఎమ్మెల్యే పంచకర్ల

జయభేరి, పరవాడ :

అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడ ఇండస్ట్రియల్ పార్క్ లో దక్షిణ ఎనర్జీ కెమికల్ కంపెనీలో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో మృత్యువాత పడిన ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులను పరవాడ ఫార్మాసిటీలోనూ అలాగే విశాఖ కేజీహెచ్ వద్ద జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. అధికారులు, కంపెనీ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చించి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వపరంగాను, అటు కంపెనీ యాజమాన్యం నుండి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఈ ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు.ఈ సందర్భంగా పరవాడ ఫార్మాసిటీ వద్ద అనంతరం విశాఖ నగరంలో కేజీహెచ్ వద్ద ఎమ్మెల్యే రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఫార్మా సిటీలో ఇలాంటి దురదృష్ట ఘటనలు తరచూ జరగడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తుందోన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలుష్యం నివారణ, పరిశ్రమల్లో ప్రమాదాల అరికట్టడంపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని స్పష్టం చేశారు. అయితే ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి గల కారణాలపై జిల్లా కలెక్టర్ పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపడతారని వివరించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదేమైనా ఘటన జరిగిన వెంటనే ఆ కంపెనీ యాజమాన్యం ప్రతినిధులు చర్యలు చేపట్టాల్సి ఉందని, అలాకాకుండా వారు పరారు కావడం సరైనది కాదని పేర్కొన్నారు. దీనిపై కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, భయపడి వేరేచోటకు వెళ్ళినట్లు వారు చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రమాదంలో చోడవరం సమీపంలోని గోవాడ గ్రామానికి చెందిన 34 ఏళ్ల వేపాడ వెంకటేష్ దుర్మరణం చెందగా, అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వారంతా అనాధలు అయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. అలాగే అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటకు చెందిన 24 ఏళ్ల బోడెపు త్రినాథ్ అసువులు బాయడంతో అతని కుటుంబం రోడ్డున పడిందని వాపోయారు. మృతి చెందిన వెంకటేష్, త్రినాధులను తీసుకురాలేకపోయినా ఆ కుటుంబాలకు మంచి ఆర్థిక తోడ్పాటు అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఫార్మాసిటీలలో కంపెనీ యాజమాన్యాలు కార్మికుల రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎమ్మెల్యేతో పాటుగా కూటమి నాయుకులు పయిల జగన్నాధ రావు,బుగిడి రామ గోవిందా రావు,కన్నూరు వెంకటరమణ, చింతకాయల ముత్యాలు తదితరులు ఉన్నారు.



## మొహారం పీర్ల ఊరేగింపులో భాస్కర్

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 297 డివిజన్‌లో మొహారం పీర్ల పండుగ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భాస్కర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హిందూ, ముస్లిం ప్రజలు మత సామరస్యంతో, సోదరభావంతో మొహారం పండుగను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మొహారం పండుగ సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కరెంట్ షాక్‌తో మృతి చెందిన బాలాజీ శర్మ కుటుంబానికి ఆర్థిక సాయం


■ చింతల గొర్లివానిపాలెం గ్రామస్తుల మానవత్వం చాటుకున్న సహాయం



జయభేరి, పరవాడ :

కరెంట్ షాక్‌తో అకాల మరణం పొందిన చింతల గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన అందుకూరి బాలాజీ శర్మ కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ ప్రజలు మానవత్వం చాటుకున్నారు.పరవాడ మండలం చింతల గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన అందుకూరి బాలాజీ శర్మ ఇటీవల కరెంట్ షాక్ తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాలాజీ శర్మ కుటుంబాన్ని ఆదుకునేందుకు చింతల గొర్లివానిపాలెం గ్రామస్తులు ముందుకొచ్చారు.కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో గ్రామ ప్రజలంతా కలిసి లక్షా పది హేను రూపాయలు విరాళంగా సేకరించారు. సేకరించిన మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి తాము న్నామంటూ ధైర్యాన్ని నింపారు.ఆపదలో ఉన్న తోటి కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తుల ఉదారతపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నగదు పంపిణీ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పైల దినేష్, మాజీ సర్పంచ్ గొర్లి ఎరుకునాయుడు, మాజీ ఉప సర్పంచ్ గొర్లి రామారావు, పైల శ్రీను, రెడ్డి రామారావు, గొర్లి ప్రసాద్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.

## దక్షిణ ఎనర్జీ పరిశ్రమ అగ్నిప్రమాదంలో మరణించిన కార్మికులకు 33లక్షల నష్ట పరిహారం



జయభేరి, పరవాడ :

పరవాడ ఇండస్ట్రియల్ జోన్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగిన దక్షిణ ఎనర్జీ పరిశ్రమ అగ్నిప్రమాదంలో మృతి చెందిన గోవాడకు చెందిన వేపాడ వెంకటేష్ (34), త్రినాథ్ (24) ఒక్కొక్కరికి 33 లక్షల రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెల్లించడానికి ప్రభుత్వ ఉన్నత అధికారులు,యాజమాన్యం,బాధిత కుటుంబాలు, కార్మిక సంఘ నాయుకులు మధ్య అంగీకారం కుదిరింది.ఈ నష్ట పరిహారం మొత్తం యాజమాన్యం చెల్లించడానికి బాధిత కుటుంబాలకి అండగా ఉండడానికి దక్షిణ ఎనర్జీ పరిశ్రమ యాజమాన్యం ఒప్పకొన్నట్టు అధికారులు తెలియజేసారు.

## పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

■ మానవత్వాన్ని చాటుకున్న కంటి వైద్య నిపుణులు కే. గోపికృష్ణ



జయభేరి, పరవాడ:

సామాజిక బాధ్యతతో పేద విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ కంటి వైద్య నిపుణులు, అనిత ఆప్టికల్ అధినేత కే. గోపికృష్ణ అన్నారు. మంగళవారం పరవాడ మండలం భరణికం గ్రామంలోని న్యూ హోప్ హోం బేతల్ మినిస్ట్రీస్ పేద బాలికల వసతి గృహంలో ఆయన తండ్రి కళ్ళెంపూడి అర్జున జ్ఞాపకార్థం విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థి, విద్యార్థినుల కనీస అవసరాలను గుర్తించి, తన వంతు చిన్న సాయంగా 80 మంది బాలురు, బాలికలకు దుప్పట్లను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. వైద్య వృత్తిలో ఎంతో బిజీగా ఉంటూనే, విరామ సమయాల్లో ఇలాంటి నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కంటి వైద్య నిపుణులు గోపికృష్ణను వసతి గృహ నిర్వాహకులు, స్థానికులు ఘనంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## వైస్సార్సీపీ జిల్లా కమిటీలలో నియామించబడ్డ వైసీపీ నేతలకు పైలా అభినందనలు

■ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన

జయభేరి, పరవాడ :

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా కమిటీలో వివిధ కీలక పదవులకు నియమితులైన పరవాడ మండల నాయకులకు వైస్సార్సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పైలా శ్రీనివాసరావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.పరవాడ మాజీ సర్పంచ్,పార్టీలో సీనియర్ నాయుకుడు చుక్క రామునాయుడుకి జిల్లా కమిటీలో స్థానం కలిపిస్తూ అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సీపీ అధికార ప్రతినిధిగా నియమించడం చాలా మంచి నిర్ణయం అని ఆలాగే కావలి వాసును జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా,బండారు కృష్ణ బాబుని జిల్లా వాలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పార్టీలో నియామకాల పట్ల పైలా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేసారు. నూతన బాధ్యతలను స్వీకరించిన నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు వైస్సార్సీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో,2029 జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. నియమితులైన నాయకుల అనుభవం కృషి పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని పైలా శ్రీనివాసరావు విశ్వాసం వ్యక్తం చేశారు.

## విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఏఈవో తేజస్విని




జయభేరి, మేడ్చల్, జూన్ 23:

ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మేడ్చల్ వ్యవసాయ శాఖ అధికారిని తేజస్విని సూచించారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పుడూర్ రైతువేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ తేజస్విని మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అనుమతించిన పరిశోధన సంస్థలు సిఫారసు చేసిన వరి విత్తన రకాలను మాత్రమే కొనుగోలు చేసి సాగు చేయాలని తెలిపారు. రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలంగా ఉన్న KNM1638, KNM7715, RNR15048, HMT Sona, Jai Kisan, WGL444, BPT5204 వంటి విత్తన రకాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా విత్తనాల ప్యాకెట్లపై ఉన్న వివరాలను పరిశీలించాలని సూచించారు. అధికారులు అనుమతి లేని నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే పంటల సాగులో శాస్త్రీయ విధానాలను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పుడూర్ సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,శ్యాంలాల్, రేగురాజు, పోచయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పెయింటర్ల గిట్టుబాటు రేట్ల కోసం మేడ్చల్‌లో భారీ బైక్ ర్యాలీ

జయభేరి, మేడ్చల్, జూన్ 23:



దేశంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో పెయింటర్లకు పనికి తగిన గిట్టుబాటు రేట్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ పట్టణంలో భవన నిర్మాణ కార్మిక రంగానికి చెందిన పెయింటర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ కార్యాలయం వద్ద కార్మికులు సమీకరమై మేడ్చల్ పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా "కార్మికులారా ఏకంకండి", "పెయింటర్లకు తగిన గిట్టుబాటు రేట్లు కల్పించండి", "పెయింటర్ల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. బిల్డర్లు, మేస్త్రీలు, ఇంటి యజమానులు పెయింటర్ల శ్రమకు తగిన పారితోషికం అందించాలని కోరారు. సుమారు 200 మంది పెయింటర్ కార్మికులు పాల్గొన్న ఈ ర్యాలీ విజయవంతంగా సాగింది. అనంతరం యూనియన్ కార్యాలయంలో కొత్తగా చేరిన పెయింటర్ కార్మికులకు యూనియన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ యాదగిరి మాట్లాడుతూ తమ పిలుపును స్వీకరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రతి పెయింటర్ కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషిచేసిన బాడీ కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, సుధాకర్, అనిల్, శ్రీకాంత్ రెడ్డి, నారాయణ గౌడ్, హనుమంత్ గౌడ్, మూర్తి, బి. రమేష్, చిన్న యాదగిరి, వెంకట్, ఎ.రాజేష్, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, కె. శ్రీకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# షూటెక్స్ అఫీషియల్ క్రికెట్ టోర్నమెంట్ ఘన విజయం

జయభేరి, మేడ్చల్, జూన్ 23:



షూటెక్స్ అఫీషియల్ ఆధ్వర్యంలో గుండ్ల పోచంపల్లిలోని స్కై స్పోర్ట్స్ అరేనాలో నిర్వహించిన రెండు రోజుల క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు పోటీపడి తమ ప్రతిభను చాటుకోగా, ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను అలరించింది. టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో యూఎన్క్యూ 7 సురారం జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచి ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గుండ్లపోచంపల్లి క్రికెట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు నిర్వాహకులు అందజేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడి ప్రేక్షకులకు వినోదాన్ని పంచారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం ప్రతిభావంతులైన ఆటగాళ్లకు వేదిక కల్పించడమే షూటెక్స్ అఫీషియల్ లక్ష్యమని నిర్వాహకులు మాస్కురి సుధాకర్, హర్షవర్ధన్ తెలిపారు. టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన స్పాన్సర్లు, అంపైర్లు, వాలంటీర్లు, ప్రేక్షకులు పాల్గొన్న అన్ని జట్లకు హర్షవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సుధాకర్ మస్కూరి, షూటెక్స్ అఫీషియల్ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# విత్తన మేళాకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలి

■ వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

జయభేరి, మేడ్చల్, జూన్ 23:

మేడ్చల్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న విత్తన మేళా (సీడ్ మేళా)కు రైతులు అధిక సంఖ్యలో హాజరై ప్రయోజనం పొందాలని మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి కోరారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విత్తన మేళాలో రైతులకు అవసరమైన పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా KNM1638, KNN7715, RNR15048, HMT సోనా, జై శ్రీరామ్, WGL44, BPT5204 వంటి వరి విత్తనాలను ప్రదర్శనతో పాటు విక్రయానికి కూడా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రణదీప్ రెడ్డి, కౌన్సిలర్లు సద్ది సురేష్‌కుమార్, చెనోళ్ల భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ గోపాని వెంకటేశ్ యాదవ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

■ మేహర్‌బాబా నగర్, కృష్ణా నగర్‌లలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, కాప్రా :

కాప్రా డివిజన్ పరిధిలోని మేహర్‌బాబా నగర్‌లో రూ.25 లక్షలు, కృష్ణా నగర్‌లో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం మా లక్ష్యమని కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రహదారులు, డ్రైనేజీలు, పార్కులు తదితర అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. మేహర్‌బాబా నగర్, కృష్ణా నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తవడంతో స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ప్రాజెక్టుకు భూమిపూజ



జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గుల్మోహర్ గార్డెన్స్ అనెక్సర్‌జి బ్లాక్‌లో నూతనంగా మంజూరైన తాగునీటి ప్రాజెక్టు పనులకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, వాటర్ బోర్డు డీజీఎం వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఎం.డి. ఉస్మాన్, గుల్మోహర్ గార్డెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, అసోసియేషన్ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్థానికులు, కాలనీలో తాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచే ఈ ప్రాజెక్టును మంజూరు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, వాటర్ బోర్డు అధికారులకు, సంబంధిత ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం గుల్మోహర్ గార్డెన్స్ అనెక్సర్‌జి బ్లాక్ నివాసితులకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## కారిడార్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



జయభేరి, ఉప్పల్ :

నల్లచెరువు అభివృద్ధి పనులు, బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కొనసాగుతున్న నల్లచెరువు అభివృద్ధి పనులతో పాటు బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యత, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నల్లచెరువు అభివృద్ధి ద్వారా పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లచెరువు వద్ద బస్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేస్తాం

■ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ డివిజన్ పరిధిలోని నల్లచెరువు ప్రాంతంలో బస్ టెర్మినల్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని, ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా ఈ ప్రతిపాదనను తీసుకెళ్లి, బస్ టెర్మినల్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నల్లచెరువు ప్రాంతంలో ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. బస్ టెర్మినల్ ఏర్పాటుతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలకు కూడా కొంతవరకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థల పరిశీలన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు

■ ఉద్యమకారుల గుర్తింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి
■ చైర్మన్ కేకే కు వినతి పత్రాన్ని అందించిన టీయుడబ్ల్యూజే
■ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక



జయభేరి, హైదరాబాద్ :

మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం నాడు టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావును బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజికఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు.

అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. కమిటీ చైర్మన్ కేకే ను కలిసిన వారిలో విరాహత్ అలీతో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (HUJ) అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### సమగ్రంగా అధ్యయనం చేసి న్యాయం చేస్తాం -కే. కేశవరావు

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, రాజకీయ, రాజకీయేతర రంగాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కె. కేశవరావు టీయుడబ్ల్యూజే బృందంతో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా కోణాల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఉద్యమ సాక్ష్యాలను పరిగణలోకి తీసుకొని, ఆయా రంగాల ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాల నుండి సేకరించిన సమాచార నివేదికలు, ఆయా వర్గాలతో ప్రత్యేక సంప్రదింపులు నిర్వహించి, ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో సీనియర్ పాత్రికేయులతో కమిటీ సమావేశమై వారి సలహాలు కూడా తీసుకుంటుందని కేశవరావు అన్నారు.

# మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ భరోసా

■ ఉప్పల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ చీరల పంపిణీ




జయభేరి, కాప్రా జూన్ 23:

ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీర అందిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. కుషాయిగూడ లక్ష్మీ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి గారు, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ స్ఫూర్తితో ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నాం. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీర అందిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత గౌరవం, స్థానం ఉంటుంది అని అన్నారు. పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి గారి లక్ష్యం. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేసి చూపించాం. త్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం. మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ తో ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి అని అన్నారు. వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మంగళవారం హెల్మెట్ల పంపిణీ చేశారు .మంగళవారం లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ జోన్ డీసీపీ కే. సురేష్ కుమార్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకట్ రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, ఎస్ఐలు మధుసూదన్, వినయ్, సమత, లిటిల్ ఫ్లవర్ కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, డైరెక్టర్ బ్రదర్ జాన్ కలిరికల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి, టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపలి శివాజీ, టి యు డబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. గత 25 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఉప్పల్ ప్రెస్ క్లబ్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ కూడా అందజేస్తామని క్లబ్ అధ్యక్షులు వి. తిరుపతి రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో SIR పై BLO, BLA సమన్వయ సమావేశం. ఈ సమావేశంలో పాల్గొన్న మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, BLA లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని డివిజన్లకు చెందిన బూత్ లెవెల్ ఆఫీసర్లు (BLOలు), బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAలు) పాల్గొన్న సమన్వయ సమావేశం ఎదులాబాద్‌లోని ACE ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణ, ఇంటింటి సర్వే, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, తొలగింపులు మరియు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల రెవెన్యూ అధికారి (MRO), ఇతర ఎన్నికల శాఖ అధికారులు పాల్గొని BLOలు, BLAలకు శిక్షణ అందించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. BLO లచే ఇంటింటి సర్వే 25జూన్ నుండి 24జులై వరకు జరుగుతుందని ప్రజలు అందరూ సహకరించి SIR లో పాల్గొని వారి ఓటును నిర్ధారించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ మరియు మేడిపల్లి డివిజన్ ల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, BLOలు, BLAలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నీటి లభ్యత ఉన్న రైతులు సన్న వడ్లను పండించాలి

జయభేరి, సిద్ధిపేట :

జిల్లాలో ఎల్ నీనో ప్రభావం మొదలైందని నీటి లభ్యత ఉన్నరైతులు సన్న వడ్లను పండించాలని కలెక్టర్ కె. హైమావతి అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్ష బావ లోటు ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, కూరగాయలు మాత్రమే వెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రైతువేదికలో వ్యవసాయ శాఖ వారు నిర్వహించిన విత్తన మేళ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర మొత్తంలో అన్ని రైతు వేదికలలో సబ్సిడీతో జూన్ నేటి నుండి జూన్ 30 వరకు విత్తనాల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భారత వాతావరణశాఖ ఎల్ నీనో ప్రభావం మొదలైందని హెచ్చరించడం జరిగిందని దీని వలన వర్షాభావ పరిస్థితులు ఉంటాయని అనుకూలమైన వర్షాలు ఉండవని ఎక్కువ శాతం రైతులు వరి పండిస్తున్నారని దీనికి సక్రమమైన సమయంలో వర్షాలు లేకపోవడం వలన పంట ఎండిపోయి దిగుబడి తగ్గుతుందని కాబట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు కొన్ని రకాల విత్తనాలను ఎంపిక చేస్తారని నీటి పారుదల ఎక్కువ ఉన్న రైతులు సన్న వరి పండించాలని ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను వేసుకోవాలని సూచన చేయడం జరిగింది. వర్షా భావ పరిస్థితిలో ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, నూనె గింజలు, కంది, మినుము, పెసర, మిల్లెట్స్, కూరగాయలు ఇలాంటివి అన్ని కూడా పండించాలి తెలియజేయడం జరిగిందని తెలిపారు. వర్షాబావ పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ కూడా నారుమడులు కూడా వేసుకోలే కాబట్టి మనకున్న వనరులను దృష్టిలో ఉంచుకొని వాతావరణం అనుకూలించే పంటలను పండించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయడం కోసం అన్ని రైతువేదిక లో విత్తనాలు కొనుగోలు చేయడం జరుగుతుందని విత్తన మేళ ఈరోజు నుండి 30వ తారీకు వరకు కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని రైతు చిన్ని శ్రీనివాస్ రెడ్డి 10 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పూర్తి సంప్రదాయబద్ధంగా ఏలాంటి రసాయనాలు వాడకుండా పండిస్తున్న అరటి, పొప్పాయి, కోకో, మునగ తోటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. రసాయనాలు వాడకుండా ఎరువుల తయారీ విధానాన్ని, సూక్ష్మ నీటి సరఫరా గూర్చి రైతు వివరించారు. ఇలాగే సంప్రదాయబద్ధంగా చేస్తున్నందుకు అభినందిస్తూ జిల్లా రైతాంగానికి ఒక ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏఓ స్వరూప రాణి, ఏఈఓ మీరా, సర్పంచ్ లు అమ్ములు వెంకటయ్య, మౌనిక నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సృజన సంపత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారి ఆస్తులపై ఏసీబీ సోదాలు

నిజామాబాద్ ఎక్సైజ్ అధికారి అవినీతి వ్యవహారంపై ఏసీబీ దృష్టిపెట్టింది. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ మల్లారెడ్డి నివాసాల్లో బంధువుల ఇళ్లలో కూడా ఏసీబీ సోదాలు చేపట్టింది. నిజామాబాద్ లోని కార్యాలయం, నివాసం, హైదరాబాద్ మచ్చ బోల్లారంలో ఉన్న నివాసం సహా మొత్తం పదకొండు చోట్ల ఏసీబీ అధికారులు సిబ్బంది మంగళవారం ఉదయం నుండి సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం .



# వర్షాకాలంలో బట్టల దుర్వాసనతో ఇబ్బందా?

**వర్షాకాలంలో దుస్తులు త్వరగా ఆరకపోవడం, వాటి నుంచి దుర్వాసన రావడం చాలా సాధారణం. తేమతో కూడిన వాతావరణం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే, కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే, ఈ దుర్వాసనను సులభంగా దూరం చేసుకోవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లగా, తేమగా మారుతుంది. ఈ సమయంలో దుస్తులు ఆరడానికి చాలా సమయం పడుతుంది.**

మూడు, నాలుగు రోజులు గడిచినా బట్టలు తడిగా ఉండిపోవడం, వాటి నుంచి చెడు వాసన రావడం చాలామందికి ఎదురయ్యే సమస్య. ఎంత పెర్ఫ్యూమ్ కొట్టినా ఆ వాసన వదలదు, ఫలితంగా ఆ దుస్తులు ధరించడం కష్టంగా మారుతుంది. అయితే, ఈ సమస్యకు కొన్ని సులభమైన పరిష్కారాలు ఉన్నాయి.

**1. నిమ్మరసంతో దుర్వాసనకు చెక్:**

మీరు దుస్తులు ఉతికేటప్పుడు వాడే సర్ఫ్‌లో (డిటర్జెంట్‌లో) కొద్దిగా నిమ్మరసం కలపడం వల్ల దుర్వాసన రాకుండా ఉంటుంది. నిమ్మరసంలో ఉండే విటమిన్ సి వాసనను తొలగించడమే కాకుండా, దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా చంపుతుంది. ఇది దుస్తులకు సహజమైన సువాసనను అందిస్తుంది.

**2. బేకింగ్ సోడా:**

దుస్తులు ఉతికే డిటర్జెంట్‌లో బేకింగ్ సోడా కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతాయి. బేకింగ్ సోడా ఒక అద్భుతమైన వాసన నివారిణి. ఇది దుస్తులలోని చెడు వాసనలను గ్రహించి తొలగిస్తుంది. అలాగే, ఉతికిన తర్వాత దుస్తులకు మంచి సువాసన కోసం కంఫర్ట్ వంటి ఫ్యాబ్రిక్ సాఫ్టెనర్‌లను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితాలు ఉంటాయి.

**3. కర్పూరం బిళ్ళతో సువాసన:**

వర్షాకాలంలో దుస్తుల నుంచి దుర్వాసనను పోగొట్టడానికి కర్పూరం బిళ్ళలు కూడా చాలా ఉపయోగపడతాయి. దుస్తులు ఆరిన తర్వాత లేదా వాటిని అలమరాలో భద్రపరిచేటప్పుడు, కొన్ని కర్పూరం బిళ్ళలను దుస్తుల మధ్య ఉంచండి. కర్పూరం సహజంగా సువాసనను వెదజల్లి, దుస్తులకు తాజాగా ఉండేలా చేస్తుంది. ఇది తేమను కూడా కొంతవరకు గ్రహిస్తుంది.

**4. వాషింగ్ మెషిన్, డ్రైయర్ వాడకం:**

ఈ రోజుల్లో చాలామంది వాషింగ్ మెషిన్, డ్రైయర్లను ఉపయోగిస్తున్నారు. ఇవి దుస్తులను త్వరగా ఆరబెట్టడంలో సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు డ్రైయర్ వాడినా కూడా తేమ వల్ల దుర్వాసన రావొచ్చు. పైన చెప్పిన చిట్కాలు వాషింగ్ మెషిన్‌లో ఉతికిన దుస్తులకు కూడా వర్తిస్తాయి. డ్రైయర్‌లో ఆరబెట్టిన తర్వాత కూడా తేలికపాటి దుర్వాసన అనిపిస్తే, ఈ నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా కర్పూరం చిట్కాలను పాటించవచ్చు. ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో మీ దుస్తులు తాజాగా, సువాసనభరితంగా ఉండేలా చూసుకోవచ్చు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**


పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?**

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

**కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?**

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

**ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భంగిమ వంటి యోగా భంగిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.**

**పెల్విక్ టిల్ట్స్ :**

మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపవచ్చు.

**నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:**

మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

**పిల్లల భంగిమ:**

నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:**

సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

**ముఖ్యమైన విషయాలు:**

ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్కలంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలిగిస్తుంది.



# క్రేజీ ఆఫర్ కొట్టేసిన బ్యూటీ..



తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి క్రేజ్ తెచ్చుకుంది. గతంలో ఈ అమ్మడు చేసిన కామెట్స్ ఇప్పుడు వైరల్ గా మారింది. నివేదా పేతురాజ్.. ఈ చిన్నది తన అందంతో పాటు నటనతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన మెంటల్ మదిలో అనే సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది నివేదా పేతురాజ్. తొలి సినిమాతోనే నటన పరంగా మంచి మార్కులు కొట్టేసింది. మెంటల్ మదిలో సినిమా తర్వాత చిత్ర లహరి సినిమాలో సెకండ్ హీరోయిన్ గా చేసింది ఈ అమ్మడు. ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో నివేదా పేతురాజ్ క్రేజ్ పెరిగింది. ఆతర్వాత బ్రోచేవారెవరురా సినిమా చేసింది. అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన అల వైకుంఠపురములో సినిమాలోనూ సెకండ్ హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా తర్వాత బ్లడీ మేరీ, విరాట పర్వం, దాస్ కా ధమ్కీ, బూ, పరువు సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆతర్వాత సినిమాలకు చిన్న బ్రేక్ ఇచ్చింది నివేదా పేతురాజ్.. మొన్నామధ్య తన ప్రియుడిని పరిచయం చేసింది. కానీ ఆతర్వాత ఈ ఇద్దరూ బ్రేకప్ చెప్పుకున్నారు. ఇప్పుడు తిరిగి సినిమాల్లో బిజీగా మారింది నివేదా పేతురాజ్. ఇటీవలే సింగ్ గీతం సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి మరో క్రేజీ ఆఫర్ వచ్చిందని తెలుస్తుంది. ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న కొత్త సినిమాలో నివేదా పేతురాజ్ హీరోయిన్ గా నటిస్తుందని తెలుస్తుంది. గతంలో ఈ ఇద్దరూ కలిసి రెడ్ సినిమాలో నటించారు. ఆ సినిమాలో నివేదా పేతురాజ్. పోలీస్ ఆఫీసర్ గా నటించింది. ఇక ఇప్పుడు రామ్ సరసన హీరోయిన్ గా నటిస్తుందని తెలుస్తుంది



# పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మ అవార్డులు 2026ను ప్రకటించిన విషయం తెలిసిందే. వివిధ రంగాల్లో విశేష సేవలందించే వారికి ఇచ్చే పద్మ పురస్కారాల వేడుక రాష్ట్రపతి భవన్‌లో జరుగుతోంది. గత నెల 25న 66 మంది ప్రముఖులకు రాష్ట్రపతి అవార్డులను అందజేయగా.. ఇవాళ 47 మందికి అవార్డులు ప్రదానం చేస్తున్నారు. సినీ రంగం నుంచి ప్రముఖ తెలుగు నటులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. మలయాళ స్టార్ యాక్టర్ మమ్ముట్టికి పద్మభూషణ్, తమిళ నటుడు ఆర్ మాధవన్‌లకు పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి అందజేశారు.

**తెలంగాణ నుంచి ఏడుగురు..**


తెలంగాణ నుంచి ఏడుగురికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో గడ్డమనుగు చంద్రమౌళి (సైన్స్), దీపికా రెడ్డి (నృత్యకారిణి), గూడూరు వెంకట్రావు (వైద్యం), కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణియన్ (సైన్స్, ఇంజినీరింగ్), కుమారస్వామి తంగరాజ్ (సైన్స్, ఇంజినీరింగ్), పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి (వైద్యం), రామారెడ్డి మామిడి (మరణానంతరం) (పశు సంవర్ధక, పాడి పరిశ్రమ) ఉన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ వరించింది. ఏపీ నుంచి నటుడు గద్దె బాబూ రాజేంద్రప్రసాద్ (కళలు), మాగంటి మురళీ మోహన్ (కళలు), గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం) కి పద్మశ్రీ ప్రకటించారు.

# ప్రియదర్శి ఇడుపు కాయితం?



ప్రియదర్శి హీరోగా తెలంగాణ నేపథ్య కథాంశంతో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ద్వారా జానపద నృత్యకారిణి నాగదుర్గ కథానాయికగా పరిచయమవుతున్నది. వంశీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాత బన్నీవాసు తెరకెక్కించబోతున్నారు. ఈ నెల 25న ఈ సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఇడుపు కాయితం' అనే టైటిల్ పరిశీలనలో ఉందని తెలిసింది. భార్యభర్తల అనుబంధం నేపథ్యంలో వినోదం, భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారని, కథానుగుణంగా అదే టైటిల్ ఖరారు చేయబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# అర్ధరాత్రి బర్త్‌డే సెలబ్రేషన్‌తో క్లారిటీ ఇచ్చిన త్రిష..



తమిళ సినీ పరిశ్రమలో గత కొంతకాలంగా ఎక్కువగా వినిపిస్తున్న పేర్లు విజయ్, త్రిష. వీరిద్దరి మధ్య స్నేహానికి మించి ప్రత్యేకమైన అనుబంధం ఉందనే ప్రచారం చాలా కాలంగా జరుగుతోంది. అయితే ఇంతకాలం కేవలం రూమర్స్‌కే పరిమితమైన ఈ వార్తలు తాజాగా మరోసారి సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గత కొన్ని నెలలుగా విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఆయన కుటుంబ జీవితానికి సంబంధించి వచ్చిన వార్తల తర్వాత త్రిష, విజయ్ కలిసి పలుమార్లు కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. వివిధ కార్యక్రమాల్లో ఇద్దరూ కలిసి కనిపించడం, విజయ్ కుటుంబ సభ్యులతో త్రిష సన్నిహితంగా ఉండడం, వ్యక్తిగత వేడుకల్లో పాల్గొనడం వంటి అంశాలు వీరి రిలేషన్‌పై మరింత చర్చకు దారితీశాయి.

అయితే విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలియజేయకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాకుండా సోషల్ మీడియాలో విజయ్‌ను అన్‌ఫాలో చేశారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. దీంతో వీరిద్దరి మధ్య దూరం పెరిగిందా? ఇప్పటికే విడిపోయారా? అనే ఊహాగానాలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చక్కర్లు కొట్టాయి. అయితే ఆ రూమర్లన్నింటికీ త్రిష ఒక్క ఫోటోతోనే సమాధానం ఇచ్చినట్టైంది. విజయ్ పుట్టినరోజు వేడుక సందర్భంగా అర్ధరాత్రి నిర్వహించిన సెలబ్రేషన్‌కు సంబంధించిన ప్రత్యేక ఫోటోను త్రిష తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది. ఆ ఫోటోలో విజయ్, త్రిష ఇద్దరూ కేక్ ముందు కనిపించారు. ఆ ఫోటోకు త్రిష ఎంతో భావోద్వేగంగా క్యాప్షన్ కూడా ఇచ్చింది.

అన్నింటినీ విలువైనవిగా మార్చే వ్యక్తికి హ్యాపీ బర్త్‌డే అంటూ ఆమె పోస్ట్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. అలాగే "00:00" అనే టైమ్‌ను ప్రస్తావించడం ద్వారా ఈ సెలబ్రేషన్ అర్ధరాత్రి జరిగినదని ఆమె సూచించింది. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విజయ్, త్రిష మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడిందనే అభిప్రాయాలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వీరిద్దరి సంబంధంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, తరచూ వెలుగులోకి వస్తున్న ఈ తరహా సంఘటనలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.



# శ్రీముఖి రిప్లేతో వైరల్ అవుతున్న వీడియో..

మా ఇంటి బంగారం సినిమాపై ప్రేక్షకులతో పాటు సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. సమంత బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడం పై సర్వత్రా ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే సమంత నటనను కొనియాడుతున్నారు. యాక్టింగ్ తో పాటు యాక్షన్ సీన్స్ లోనూ అదరగొట్టారు సామ్. సమంతతో పాటు యాంకర్ శ్రీముఖి కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. ఆమె తన నటనతో ఆడియన్స్ ను కట్టిపడేసిందనే చెప్పాలి. శ్రీముఖి యాంకర్ గానే కాదు సినిమాల్లోనూ నటించింది ప్రేమ ఇష్క్ కాదల్ , జులాయి, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, భోళా శంకర్ వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. తాజాగా మాఇంటి బంగారం సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. దాంతో శ్రీముఖికి వరుస ఆఫర్స్ క్యూ కట్టడం ఖాయం అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక మా ఇంటి బంగారం సినిమా గురించి సోషల్ మీడియాలో రకరకాల రీల్స్, వీడియోస్ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ రీల్ పై శ్రీముఖి స్పందించింది. ఓ మహిళ తన భర్తతో కలిసి రీల్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీనికి శ్రీముఖి కామెంట్ చేసింది. నా భర్త నన్ను సినిమాకు తీసుకెళ్లడం లేదు శ్రీముఖి గారు మీరైనా కామెంట్ చేసి చెప్పండి అని ఆ మహిళ వీడియోలో రిక్వెస్ట్ చేసింది. దానికి శ్రీముఖి కామెంట్ చేస్తూ తీసుకెళ్లండి పాపం అని రాసుకొచ్చింది. దాంతో ఈ వీడియో కాస్త వైరల్ అవుతుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**